క్లుప్తంగా

వసతిగృహంలో వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు శివప్రతాప్

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహంలో గురువారం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వైద్యబృందం ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యుడు శివప్రతాప్ విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమాధికారి చందన, ఎఎన్ఎం పద్మ పాల్గొన్నారు.

ఆస్తి కోసం ఇబ్బంది పెడుతున్నారని..



వృద్ధురాలిని తీసుకొస్తున్న ఆర్డీవో

మంచిర్యాలటౌన్: తన పిల్లలు పట్టించుకోవడం లేదని, ఇబ్బంది పెడుతున్నారని వృద్ధురాలు అర్జీ పెట్టుకునేందుకు గురువారం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయానికి వచ్చింది. జిల్లా కేంద్రంలోని గోసేవా మండల్‌కు చెందిన సుగుణాబాయి (94). బిడ్డ, కొడుకు ఆస్తి కోసం తనను ఇబ్బంది పెడుతున్నారని న్యాయం చేయాలని కోరుతూ న్యాయవాది కొటేశ్వర్ సహకారంతో ఆర్డీవోకు ఫిర్యాదు చేసేందుకు వచ్చింది. ఆమెకు న్యాయం చేస్తానని హామీని ఇచ్చిన ఆర్డీవో శ్రీనివాసరావు తన వాహనంలో ఆమెను ఇంటికి పంపించి మానవత్వం చాటుకున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

చెన్నూర్: విద్యార్థులకు చదువుతోపాటు చట్టాలపై అవగాహన అవసరమని జూనియర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో గురువారం న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యసాధన కోసం కృషి చేయాలన్నారు. సీఐ దేవేందర్‌రావు, ఎస్సై సుబ్బారావు, న్యాయవాదులు కాయిత మహేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

నెన్నెల: ఎంపీడీవో కార్యాలయాన్ని జెడ్పీ సీఈవో గణపతి గురువారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల గురించి ఎంపీడీవో అబ్దుల్‌హై, ఎంపీవో శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్నులు, పంచాయతీల నిర్వహణ, పారిశుద్ధ్య పనుల వివరాలు, సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సిబ్బందితో సమీక్షించి పలు సలహాలు, సూచనలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

పీఎంశ్రీతో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి

దండేపల్లి: కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం శ్రీ పథకంతో ప్రభుత్వ పాఠశాలలు ఎంతగానో అభివృద్ధి చెందుతున్నాయని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. మండల కేంద్రంతోపాటు తాళ్లపేట, మామిడిపల్లి, ద్వారక, రెబ్బనపల్లి, కొర్విచెల్మ గ్రామాల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్కూల్‌బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అధికారులు

భీమారం: గొల్లవాగు ప్రాజెక్ట్ సమీపాన వనమహోత్సవంలో భాగంగా ఎక్సైజ్ సీఐ గురువయ్య గురువారం ఈతమొక్కలు నాటారు. నాయకులు పున్నంగౌడ్, సతీశ్‌గౌడ్, కిష్టాగౌడ్, సమ్మగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పాఠశాలలో బోనాల వేడుకలు



వేడుకల్లో విద్యార్థులు, హెచ్ఎం, టీచర్లు

దండేపల్లి: గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో బోనాల వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బోనాలు నెత్తిన పెట్టుకున్నారు. విద్యార్థులు పోతరాజుల వేషధారణ ఆకట్టుకున్నాయి. హెచ్ఎం బుచ్చన్న, ఉపాధ్యాయులు తెలిపారు.

అటవీ ఆంక్షలపై నిరసనగా నేడు బంద్



దీక్షలో పాల్గొన్న నాయకులు

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ జన్నారం అటవీ డివిజన్ గుండా భారీ వాహనాల రాకపోకలను పగటిపూట అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం జన్నారం మండల బంద్ నిర్వహించనున్నారు. రాకపోకల నిషేధంతో అనేక రకాలుగా నష్టపోతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు భారీ వాహనాలను అనుమతించాలని డిమాండ్ చేస్తూ సామాజిక కార్యకర్త భూమాచారి, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రినాయక్ తొమ్మిది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. మండల ప్రజలు, అన్ని పార్టీల వారు దీక్షలో పాల్గొని మద్దతునిస్తున్నారు. అటవీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బంద్‌కు వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు మద్దతు ప్రకటించాయి.

నిషేధంతో పెరిగిన ధరలు

సిమెంటు, కంకర, నిత్యావసరాలకు సంబంధించిన భారీ వాహనాలను లక్సెట్టిపేట నుంచి దండేపల్లి, జన్నారం మీదుగా, ఇటు గుడిహత్నూర్, ఉట్నూర్ నుంచి జన్నారం మీదుగా అనుమతించడం లేదు. దీంతో దూరభారం పెరిగి వాహనదారులు అద్దె పెంచడంతో వాటి ధరలను వ్యాపారులూ పెంచుతున్నారు. ఫలితంగా ప్రజలపై భారం పడుతోంది. లారీలు, ఐచర్ వ్యాన్ వంటి వాహనాలనూ అనుమతించకపోవడంతో హోటళ్లు, కిరాణ దుకాణాలు వంటి చిరువ్యాపారులకు నష్టం వాటిల్లుతోంది. గతంలో రాత్రి 9గంటల నుంచి ఉదయం 6గంటల వరకే భారీ వాహనాల రాకపోకలు నిషేధించగా.. మూడేళ్లుగా పగలూ అనుమతించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అటవీ బోర్డు సమావేశంలో రాకపోకలకు సుముఖత వ్యక్తం చేసినట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ తెలిపారు. అయినా ఈ విషయంలో అధికారులు జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులు దృష్టి సారించి భారీ వాహనాల రాకపోకలకు అనుమతించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఎడ్ల బండిపై వెళ్లి.. హెచ్చరిక బోర్డు పెట్టి



భీమిని: భారీవర్షాల నేపథ్యంలో మండలంలోని చిన్నతిమ్మాపూర్ శివారులోని ఎర్రవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎంపీడీవో గంగమోహన్ గురువారం ఎడ్లబండిపై వెళ్లి ఎర్రవాగు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ దారిలో వాహనాలు, ఎడ్లబండ్లు, మనుషులు ఎవరూ పోవద్దని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం తంగళ్లపల్లికి చెందిన చాపల భీమయ్య ఇంటి గోడ వర్షానికి పడిపోగా ఆ ఇంటిని ఎంపీడీవో పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి తిరుపతి, మాజీ సర్పంచ్ ఇందూరి భూమయ్య, మల్టీపర్పస్ సిబ్బంది ఉన్నారు.

గుడిపేట ఎంజేపీ పీడీకి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేట మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల బాలుర పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, నస్పూర్‌కు చెందిన వంగల సురేశ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బుధవారం గౌరవ డాక్టరేట్ లభించింది. ఎఫెక్ట్ ఆఫ్ ఇంటర్‌వెల్ ట్రెనింగ్ అండ్, కోర్ స్ట్రెంత్ ట్రెనింగ్ ఆన్ ఫిజికల్ అండ్ ఫిజియాలజికల్ వేరియబుల్స్ ఎమాంగ్ లాంగ్ అండ్ మిడిల్ డిస్టెన్స్, యూనివర్సిటీ లెవెల్ అథ్లెట్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను గౌరవ డాక్టరేట్ పట్టా అందజేసింది. ఉమ్మడి జిల్లా ఆర్‌సీఓ శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వందేళ్ల వృద్ధురాలికి జన్మదిన వేడుక



కుమారులు, కుమార్తెతో ఆగమ్మ

మంచిర్యాల రూరల్(హాజీపూర్): వందేళ్ల వృద్ధురాలికి కుటుంబ సభ్యులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గోసేవా మండల్‌కు చెందిన బొట్ల ఆగమ్మ(100). ఈమె భర్త రాజయ్య 30 ఏళ్ల క్రితం మృతిచెందాడు. ఆరుగురు కుమారులు, కోడళ్లు, ఒక కుమార్తె అల్లుడితోపాటు మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. గురువారం మాజీ కౌన్సిలర్, డాక్టర్ బొట్ల సత్యనారాయణ నివాస గృహంలో ఆమె శత జన్మదినోత్సవ వేడుక కుటుంబం సమక్షంలో జరిగింది. ముందుగా ఇంట్లో లక్ష్మీ గణపతి హోమం అనంతరం కుటుంబీకులు ఆగమ్మకు పాదపూజ చేసి ఆశీర్వాదం పొందారు. అందరి ఆనందోత్సాహాల మధ్య ఆగమ్మ కేక్ కట్ చేసి సంబురాల్లో మునిగిపోయారు.

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌కు నమోదు చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఈ-పాస్‌లో విద్యార్థులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. నూతన/రెన్యువల్ కోసం జిల్లాలోని కళాశాలలు, విద్యార్థులు సెప్టెంబర్ 30లోపు www.telangana.epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. సీఈటీఎస్ ద్వారా కన్వీనర్ కోటాలో చేర్చిన విద్యార్థుల వివరాలు నమోదు వల్ల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ మంజూరు చేయడానికి వీలు ఉంటుందని పేర్కొన్నారు.

విదేశీ విద్య పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: అంబేద్కర్ ఓవర్సీస్ విద్య నిధి పథకం కోసం అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకుడు సీహెచ్.దుర్గాప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులకు రూ.20 లక్షల ఉపకార వేతనం అందించనున్నట్లు పేర్కొన్నారు. యూఎస్ఏ, ఆస్ట్రేలియా, కెనడా, సింగాపూర్, జర్మనీ, జపాన్, సౌత్‌కొరియా, న్యూజిలాండ్‌లోని విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్/ప్రొఫెషనల్ కోర్సుల్లో విద్యనభ్యసించేందుకు షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు ఆన్‌లైన్‌లో www.telangana.epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆగష్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కుటుంబ వార్షిక ఆదాయం సంవత్సరానికి రూ. 5 లక్షల మించి ఉండరాదని, పీజీ చదివేందుకు గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం కంటే ఎక్కువ మార్కులు పొంది ఉండాలని తెలిపారు.

గాడితప్పిన కాంగ్రెస్ పాలన



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

- మాజీఎమ్మెల్యే దివాకర్‌రావు

నస్పూర్: కాంగ్రెస్ పాలన గాడితప్పిందని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో గురువారం నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ కేటీఆర్ మంత్రిగా అన్ని పట్టణాలను అభివృద్ధి చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం మంచిర్యాలలో అడుగడునా గుండాయిజం, అధికార దుర్వినియోగం అవుతుందని ఆరోపించారు. నస్పూర్, మంచిర్యాల పట్టణ అధ్యక్షులు సుబ్బయ్య, గాదె సత్యం, మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పల్లె భూమేష్, టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు తిరుపతి, నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: ఏఎంసీ ఏరియాలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఏరియాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సుదర్శన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: కేటీఆర్‌ను హైదరాబాద్‌లో గురువారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు కుటుంబీకులతో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలను తెలిపారు.

జైపూర్/మందమర్రిరూరల్/కోటపల్లి/జన్నారం/చెన్నూర్/నెన్నెల/శ్రీరాంపూర్/కాసిపేట/రామకృష్ణాపూర్/తాండూర్: జిల్లాలో కేటీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు సర్కారు బడుల్లో విద్యార్థులతో కేక్ కోయించి పండ్లు, నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీబీజీకేఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్, బీఆర్ఎస్ నాయకులు అరవిందర్‌రావు, దత్తుమూర్తి, పురుషోత్తంగౌడ్, జనార్దన్, రాజా రమేశ్, రవీందర్, సాంబగౌడ్, విజయ ధర్మా, సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



కాసిపేట: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘాల నాయకులు

నెన్నెల/భీమిని/కాసిపేట/మందమర్రిరూరల్/తాండూర్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో తహసీల్దార్లు జ్యోతి, శ్రవణ్‌కుమార్, భోజన్న, సతీశ్‌కుమార్, జ్యోత్స్నకు గురువారం వినతిపత్రాలు అందజేశారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. పీఆర్సీని ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. 317 జీవో వల్ల నష్టపోయిన ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు పంపించాలని కోరారు. నాయకులు చక్రపాణి, రవికుమార్, విష్ణువర్ధన్, పర్వతాలు, వెంకటేశ్వర్లు, జయకృష్ణ, సతీశ్, స్వర్ణలత, శారద, శ్రీనివాస్, కిరణ్ కుమార్, సంజీవ్, దేవ రమేశ్, అనంతరావు, వెంకటలక్ష్మి, ప్రకాశ్, శంకర్, మాణిక్‌రావు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఫండ్ విడుదల చేయాలి

కోటపల్లి: ట్రైబల్ బెస్ట్ అవేలెబుల్ స్కూల్ ఫండ్ విడుదల చేయాలని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని అదివాసీహక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జేక శేఖర్ గురువారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ట్రైబల్ వెల్ఫేర్ ద్వారా జిల్లాలో 55మంది విద్యార్థులకు ఫీజు బకాయిలు పెండింగ్‌లో ఉన్నందున నిధులు విడుదల అయ్యేలా చూడాలని మంత్రి దృష్టికి తీసుకవెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. మాజీ సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, మాజీ జడ్పీకో అపన్ సభ్యుడు అజ్గర్ ఉన్నారు.

లబ్ధిదారుల ఎంపికపై విచారణ

కోటపల్లి: కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు మండలంలోని సిర్సా గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై గురువారం ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి విచారణ చేపట్టారు. 24మందికి ఇళ్లు మంజూరు కాగా అందులో 10మంది అనర్హులని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఇంటింటా తిరిగి విచారణ జరిపారు. ఇద్దరు మాత్రమే అనర్హులుగా ఉన్నారని ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని తెలిపారు. నాయకులు పున్నంచంద్, తిరుపతి, గ్రామస్తులు ఉన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

వేమనపల్లి: ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో వీరన్న అన్నారు. మండలంలోని గొర్లపల్లి, క్యాతన్‌పల్లి, కల్మలపేట, ముల్కలపేట, సుంపుటం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను పోలీసు అధికారులతో కలిసి గురువారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల నిల్వల వివరాలను ప్రతీరోజు షాపు ముందు నోటీసు బోర్డులో ఉంచాలన్నారు.

టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు

కాసిపేట: ఎరువుల తనిఖీకి మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. తహసీల్దార్, వ్యవసాయాధికారి, ఎస్సైలు సభ్యులుగా ఉన్నారు. కాగా, స్థానిక ప్రాథమిక సహకార సంఘంలో ఎరువుల పంపిణీ, స్టాక్ రిజిస్టర్, బిల్స్, రికార్డులను తహసీల్దార్ భోజన్న, ఏవో ప్రభాకర్ పరిశీలించారు.

ఇందిరమ్మ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

వేమనపల్లి: నీల్వాయి, గొర్లపల్లి, వేమనపల్లి , ములకలపేట గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న 9 మంది లబ్ధిదారులకు ఎంపీడీఓ కుమారస్వామి మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్ గురువారం రూ.9 లక్షల చెక్కులు అందజేశారు. బేస్‌మెంట్ లెవల్ ఇళ్లు నిర్మించుకోగా లక్ష చొప్పున బిల్లు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాబీర్‌ఆలీ, ఏఈ డేవిడ్ భాస్కర్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, రాజన్న, గాలి మధు, రాంచందర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మందమర్రిరూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీపీవో వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అందుగులపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిసరాలను గురువారం పరిశీలించారు. ఎంపీవో సత్యనారాయణ, కార్యదర్శి వీరేందర్ ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని మెప్మా కార్యాలయంలో ఆర్పీలకు గురువారం ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా సంఘ సభ్యులకు రుణాలు అందించడంతోపాటు, వారు సకాలంలో చెల్లించేలా చూడాలని ఆర్బీఐ ఎల్డీవో శ్రీనివాస్, ఎల్డీం తిరుపతి పేర్కొన్నారు. టీఎంసీ చంద్రయ్య, సీవోలు సుజాత, సరోజ, అరుణ, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు జ్యోతి పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

వేమనపల్లి: ప్రాణహిత బ్యాక్‌వాటర్‌తో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్ అన్నారు. మండలంలోని ముల్కలపేట-రాచర్ల గ్రామాల మధ్యన పంట నష్టపోయిన చేళ్లను రైతులతో కలిసి పరిశీలించారు. నాయకులు వెంకటేశ్, చరణ్‌రాజ్, శ్రీకాంత్, రమేశ్‌గౌడ్, అజయ్‌కుమార్ ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలటౌన్: ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్‌ను తెలంగాణ మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు గురువారం కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వర్షంలో తడవకుండా రెయిన్‌కోట్లు ఇవ్వాలని, వేతనాలను సకాలంలో అందించాలని కోరారు. అనంతరం ఆయన్ను సన్మానించారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

లక్సెట్టిపేట: కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు బీజేపీ సీనియర్ నాయకులు వెర్రబెల్లి రఘునాథరావు సూచించారు. మండల కేంద్రంలోని ఎస్పీఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన మండలస్థాయి వర్క్‌షాప్ సమావేశంలో మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి పథకాలను వివరించాలన్నారు. నాయకులు ముత్తె సత్తయ్య, ప్రభాకర్, అశోక్, కిషన్, సతీశ్, వెంకటేశ్వర్‌రావు, మురళి, గంగన్న పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

మంచిర్యాలఅర్బన్: వసతిగృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా ఉపవైద్యాధికారి వైద్యురాలు అనిత అన్నారు. జిల్లాకేంద్రంలోని సాయికుంట గిరిజన బాలికల పాఠశాల వసతిగృహాన్ని గురువారం పరిశీలించారు. ఇద్దరు బాలికలు అనారోగ్యంతో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరిన నేపథ్యంలో వసతిగృహం సందర్శించారు. కిచెన్ వెనుక నీరు నిలిచి ఉన్న విషయాన్ని గమనించి దోమల ఉత్పత్తికి కారణం కాకుండా చూసుకోవాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, సబ్‌యూనిట్ అధికారి నాందేవ్, ఏఎన్ఎం మహేశ్వరి ఉన్నారు.

రోడ్లపై కోతులకు ఆహారం వద్దు

జైపూర్: మంచిర్యాల-చెన్నూర్ జాతీయ రహదారులపై అటవీ మార్గంలో కోతులకు ఆహార పదార్థాలను వేయొద్దని మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్‌కుమార్ తెలిపారు. జైపూర్ సమీపంలో వెలిశాల మల్లన్న ఆలయం, అటవీ అభివృద్ధి సంస్థ నీలగిరి ప్లాంటేషన్ సమీపంలో రహదారి వద్ద కొందరు అరటిపండ్లు, ఆహార పదార్థాలు వేస్తుండగా వారిని గురువారం వారికి కౌన్సెలింగ్ చేశారు.

వ్యాధి నిర్ధారణ క్షయనివారణకు మార్గం

తాండూర్: సత్వరం వ్యాధి నిర్ధారణే క్షయ నివారణకు మార్గమని జిల్లా క్షయ నివారణాధికారి సుధాకర్‌నాయక్ అన్నారు. గురువారం తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో కిష్టంపేటలోని రైతు వేదికలో వైద్య శిబిరం నిర్వహించారు. 134 మందికి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రూనీస్, లక్ష్మీ, ప్రసన్న, శిరీష, పంచాయతీ కార్యదర్శి ఉదయ్, ఎన్‌వీహెచ్‌సీబీ జిల్లా ఇన్‌చార్జి మధుబాబు, టీబీ సూపర్‌వైజర్ శశికాంత్, సూపర్‌వైజర్లు ఉన్నారు.

మంత్రిని కలిసిన ఏఐటీయూసీ నాయకులు



మంత్రి వివేక్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణిలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు గురువారం రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిశారు. హైదరాబాద్ సచివాలయంలో యూనియన్ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజకుమార్‌లు కలిసి కాంట్రాక్టు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి ప్రతం అందజేశారు. నాయకులు ఎల్లారెడ్డి, అఫ్రోజ్‌ఖాన్, కృష్ణయ్య, క్రిస్టోఫర్ జట్టి మల్లయ్య తదితరులు ఉన్నారు.

ఆర్కే 5 గని తనిఖీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 5 గనిని డీఎంఎస్(మైనింగ్) ఎన్.నాగేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీఎం శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్‌తో కలిసి గనిలోని 4వ సీమ్ పని స్థలాలను సందర్శించి రక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఏజెంట్ శ్రీధర్ మేనేజర్, గని మేనేజర్ సుధీర్ కుమార్, ఇన్‌చార్జి రక్షణ అధికారి రాందాస్, సర్వే అధికారి సంపత్, వర్క్ మెన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేత

మందమర్రిరూరల్: కేకే-5 గనిలో విధులు నిర్వహించే లక్ష్మణ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడికి సంబంధించిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.15.80 లక్షల చెక్కును గురువారం గనిపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రూపు ఏజెంట్ రాంబాబు, మేనేజర్ శంభునాథ్ పాండే.. అతని భార్య సరితకు అందించారు. గని రక్షణ అధికారి రమేశ్, సంక్షేమాధికారి రవళి, టీయూసీ బ్రాంచి కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

డిస్మిస్ జేఎంఈటీలను తీసుకోవడానికి ఒప్పందం

శ్రీరాంపూర్: సింగరేణిలో నిర్ణీత మస్టర్లు చేయలేదనే కారణంతో డిస్మిస్ చేసిన జేఎంఈటీలను తిరిగి ఉద్యోగాల్లో తీసుకునేందుకు ఒప్పందం జరిగింది. హైదరాబాద్‌లోని ఆర్ఎల్సీ కార్యాయలంలో సీఎల్సీ శ్రీనివాస్‌లు సమక్షంలో గురువారం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, సింగరేణి యజమాన్యానికి మధ్య రాతపూర్వకంగా ఒప్పందం జరిగింది. జీఎం (పర్సనల్) కవితానాయుడు, జీఎం(సీపీపీ) మనోహర్, జీఎం(ఐఈడీ) రవికుమార్, ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరబద్రయ్య, ముస్కె సమ్మయ్య, వైవీ రావు, మడ్డి ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

వార్డు పరిధిలో నిర్మాణాలు పరిశీలన

బెల్లంపల్లి: మున్సిపాలిటీ 31 వార్డు పరిధిలోని సింగరేణి ఖాళీ స్థలాల్లో నిర్మాణం చేస్తున్న శాశ్వత కట్టడాలను వెంటనే నిలిపివేయాలని సింగరేణి ఎస్అండ్ పీసీ సిబ్బంది ఆదేశించారు. గురువారం వార్డు పరిధిలో నిర్మాణాలను పరిశీలించారు. అనుమతి లేకుండా నిర్మానాలు చేపట్టడం సరి కాదని, ఇదివరకు నోటీసులు అందజేసినా ఇంకా కొనసాగించడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ విషయంలో నిర్మాణదారులు, ఎస్అండ్‌పీసీ సిబ్బంది మధ్య వాగ్వాదం జరిగింది. భూపత్రాలు ఉన్నప్పుడు అర్ధరాత్రి నిర్మాణం ఎందుకు చేస్తున్నారని అధికారులు వాదించారు. కొందరి అండదండలతో దర్జాగా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని బస్తీ వాసులు బాహాటంగా విమర్శిస్తున్నారు.


ఘనంగా తీజ్ పండగ



నృత్యాలు చేస్తున్న యువతులు

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం పులిమడుగులో తీజ్ పండగను గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. లంబాడాలు, బంజారా లు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వర్షాలు బాగా కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, పెళ్లి కాని యువతులు మంచి గుణగణాలు కలిగిన వరుడు లభించాలని ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాలు, సంప్రదాయ నృత్యాలతో యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వర్షానికి తెగిన కంకర రోడ్డు



భీమిని: మండలంలోని చెన్నపూర్ నుంచి రాజారం వెళ్లే కంకర రోడ్డు గురువారం కురిసిన వర్షానికి తెగిపోయింది. దీంతో అటుగా వెళ్లే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెద్దతిమ్మాపూర్, పెద్ద గుడిపూట, కాజీపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్లు బురదమయంగా మారడంతో గ్రామాల ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. కాగా, భీమిని, కన్నెపల్లి మండలాల్లోని చెరువుల్లోకి వర్షపు నీరు చేరుతోంది.

నాణ్యమైన విద్య అందించాలి

తాండూర్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని డీఈవో యాదయ్య అన్నారు. మండలంలోని తంగళ్లపల్లి స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి గురువారం ఆయన హాజరయ్యారు. స్కూల్ కాంప్లెక్స్‌లో అమలవుతున్న ఉత్తమ విధానాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కేజీబీవీని సందర్శించి 10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను విద్యాస్థాయిని పరీక్షించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. ఎంఈవో మల్లేశం, డీఐఈఓ అంజయ్య ఉన్నారు.

కళ్లగంతలు కట్టుకుని నిరసన

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యులు గురువారం స్థానిక ఐబీ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. చలో సెక్రటేరియట్‌కు పిలుపునిస్తే ముందస్తు అక్రమ అరెస్టులు చేయడాన్ని జిల్లా కార్యదర్శి తిరుపతి ఖండించారు. మణిచరణ్, దినేష్, కార్తీక్ పాల్గొన్నారు.